కథానిక :

# మామిడి తోపులో కోర్కెలు

—శ్రీ గోరాశాస్త్రి

సుందరమ్మ నడుస్తున్నప్పుడు అడుగు జాగ్రత్తగా వేస్తుంది; భద్రంగా వేస్తుంది; నడక అలవాటులేని సుందరమ్మ. యిరవై రెండేండ్ల సుందరమ్మ. ఊరి పొలిమేరనుండి అప్పుడే నాలుగు మైళ్లు నడిచింది. అదైనా ఒక తీరైన రోడ్డూ అదీ అయితే కొంత నయం. ఎత్తుపల్లాల పుంతవెంబడి, రెండు బ్రహ్మజెముడు కట్టవల మధ్య మూడుమైళ్లు నడిచాక. అక్కడనుండి కాస్త అడివి అన్నది ఆరంభమై, వింత వింత పక్షుల కూతలతో, గుండెలు గతుక్కుమంటూ నడుచుకుపోవడం అంటే, అది సుందరమ్మలాంటి మనుషులు సామాన్యంగాచేసే పనికాదు. కాని సుందరమ్మ నడుస్తోంది, ఏదో సివం ఎత్తిన మనిషివలె; అవతల ఏదో ఒక బ్రహ్మాండమైన పని, బ్రతుకు చాలించేముందు విధిగా చెయ్యవలసిన ఆఖరుపని కోసం హడావిడిగా వెళ్ళే మనిషివలె.

అలిసిపోయింది సుందరమ్మ; ధనుర్మాసం చలి. అయినా ఆమె శరీరం చెమటపట్టింది; ముంగురులు తడిసి నుదిటికి అంటుకుపోయాయి. ఇంతలో పుంత ఆఖరయింది. బీడు మొదలయింది. కాలిదారి ప్రక్కనే ఓ పెద్దగుట్ట—నల్ల నాపరాళ్ళ గుట్ట ఉంది. సుందరమ్మ కాస్త పేదతీర్చుకుందామని గుట్టమీద చతికిల పడింది.

అప్పటికప్పుడే బాగా సాయంత్రం అయింది. సీతాకాలం ఎండపొడలు చెట్లకొమ్మలమీద చివరని ప్రతిఫలిస్తున్నా, నేలమీద చీకట్లు చిక్కబడుతున్నాయి. రివ్వున చలిగాలి వేస్తోంది. గడ్డగాలి. ఆలోచిస్తోంది సుందరమ్మ, ఆరోజు ఉదయంనుండీ జరిగిన విషయాలన్నీ ఒక్కసారి కళ్ళముందు మెదిలాయి. క్రిందటి వారం అత్తగారూ, మరిది కనక ఆడపడుచు యింటికి వెళ్ళకపోతే, తను ధైర్యంచేసి యిలా వచ్చెయ్యగలిగేదా? అంత కలతచెందిన మనస్సుతోనూ ఒక్కసారి తనలో తను నవ్వుకుంది. ఉత్తి మాట. అదో అర్థం లేని భయం కాని, తను ఒకసారి ఒకనిశ్చయానికివచ్చి ఏదైనా ఒకపని చెయ్యడానికి సంకల్పించుకున్నప్పుడు హరిబ్రహ్మాదులయినా తనని మళ్ళించలేరు. అత్తగారనగా ఎంత? భర్త యిష్టాన్నే తను లెక్కచెయ్యలేదు. "సుందరీ; ఎవరైనా వింటే నవ్వుతారు. సరిగ్గా అర్థం చేసుకోరు. అయినా నీకన్నా కనీసం ఎనిమిదేళ్లు పెద్దవాణ్ణి. నేను చెప్పుతున్నాను. నువ్వు భ్రాంతిలో పడ్డావు." అన్నాడు. భ్రాంతి; అవును, భర్త చెప్పిన అర్థంలో కాదుగాని, ఒక రకంగా తను భ్రాంతే పడ్డది. మొదట ఆయన మాటలు నమ్మింది. నిజం అనుకుంది. ఆయనేదో ఆకాశమంత ఎత్తుగా, గొప్పగా ఏదో వీరుడివలె కనబడ్డాడు. ఇప్పుడో? కేవలం నూనె మిఠాయి సరుకని ఋజువయిపోయింది. అలా ఋజువవడానికి రెండేళ్లు పట్టింది. అదిగో; దూరాన రైలుకూతగా బోలు వినిపించినట్లయింది సుందరమ్మకి. ఎన్నాళ్ళయింది, తను రైలుబండి ఎక్కి; అయినా అది రైలుకూతేనా? ఈ దిక్కుమాలిన మన్యం అడివిలో నిశ్శబ్దం మరీ భయంకరంగా ఉంటుందేమో, శబ్దాలు మనం నిజంగా విన్నామో లేక ఊహింకున్నామో తెలియదు. అది రైలుకూతేనా? ఎంతబాగుంటుంది రైలుకూత! ఏమిటో! తను బతికున్న మనుషులతో సంబంధం ఒదులుకుని అప్పుడే రెండేళ్ళయింది.

రెండేళ్ళ క్రితం సుందరి పట్నవాసంపిల్ల. అసలు సుందరి పుటుకే ఒక పెద్ద ఊరు ఆసుపత్రిలో. భర్త అనేవాడు: ఫ్యాక్టరీలోతయారయే వస్తువులాగ ఏరగని మొగాళ్ల పరాయివాళ్ళమధ్య ఆసుపత్రిలో పుట్టడం కంటె, ఆత్మీయుల మధ్య పుట్టడం మంచిదని, అనాగరికపు పల్లెటూళ్ళలో పుట్టడంకంటె, ఫ్యాక్టరీలాఉన్నా, అన్ని సదుపాయాలూ ఉన్న ఆసుపత్రిలో పుట్టడమే నయమని తనువాదించేది. అప్పట్లో అవన్నీ సరదాగా కొత్త వలపు దంపతుల హాస్యాలవలె గడిచిపోయాయి. చిన్నతనంలోనే సుందరికి తల్లిదండ్రులు మరణించారు తరువాత అన్నగారు పెంచాడు. తనకి జ్ఞానం వచ్చిన దగ్గరనుండీ పట్నవాసాలలోనే పెరిగింది. ఎక్కడా వేళ్లు పాతుకోని మధ్యతరగతి కుటుంబానికి చెందినవాళ్ళు. తాతల హయాములోనే పల్లెటూళ్లు విడిచి పట్నాలకి వలసవెళ్ళినవాళ్ళు— అవడంచేత సుందరి కుటుంబం ఒకరకంగా స్వదేశంలోనే, కాందిశీకులని చెప్పాలి. సుందరికి 'నా' అన్న ఊరులేదు. అన్నయ్య ఏయే ఊళ్ళలో ఉద్యోగంచేస్తూంటే, ఆ ఊళ్ళన్నీ తిరిగేది. అలా అలా పెరిగి హైస్కూలు చదువు ముగించి కాలేజీలో చేరింది. ఇంటర్మీడియట్ చదువుతూండగానే వెంకటేశ్వర్లుతో పరిచయం అవడం, అన్నకి ఎదురు తిరిగి పెళ్లి చేసుకోవడం జరిగింది. అన్నయ్యకు ఆ పెళ్ళి సుతరాం ఇష్టంలేదు. వెంకటేశ్వర్లు అదో వింతరకం జంతువని అన్న ఉద్దేశం. ఈ రెండు కుటుంబాలకీ ఎక్కడా పోలికలేదు. వెంకటేశ్వర్లు వంశంవాళ్లు తరతరాలనుండి ఒక గ్రామానికే చెందినవాళ్లు. అది మన్యం ప్రాంతం, మెట్టభూములు, వర్షాధార పొలాలు. రెండుమూడేళ్లు వరుసగా ఒక్క గింజకూడా పండదు. మొక్కజొన్న మినహాయిస్తే. చుట్టుపక్కల ప్రాంతాల్లో కోయలు పోడు వ్యవసాయంచేసి అపరాలు పండిస్తారు. అంతకు మించి అక్కడ యింకేం దొరకదు. అయితేనేం: వెంకటేశ్వర్లుది విచిత్రమైన మనస్తత్వం. తనది కుగ్రామమైనా, సర్కారువారి దృష్టిలో మన్యం ప్రాంతానికి అది కూడలి స్థలంకనక, ఆ గ్రామంలో ఒక ఆసుపత్రి, ఒక హైస్కూలూ పెట్టారు. వెంకటేశ్వర్లు అందులోనే చదువుకున్నాడు. అదయినా ఏదో అపస్మారదశలో చదివేవాడుగాని, దానిమీద పెద్ద దృష్టి ఉండికాదు. అయినా ఎందుకో సర్కారువారు అతనికి స్కాలరు షిప్పు యిచ్చారు కాలేజీ చదువుకి. అది తెలిసిననాడు వెంకటేశ్వర్లుకి వచ్చిన నవ్వు యింతా అంతా కాదు. వద్దని నిరాకరించాడు. అయితే హెడ్మాస్టరు పిలిపించి కోప్పడ్డాడు. "అసలే మనం అన్ని విధాలా వెనుకబడి వున్నాం. మనవాళ్ళందరికి పెద్ద చదువులూ, ఉద్యోగాలూ లేవు. మన్ని ఆదరించేవాళ్లు కూడా లేరు. ఎన్నాళ్లు యిలా యీ గొడ్డు భూముల్ని దున్నుకుంటూ తరతరాలుగా ఎదుగూ బొదుగూ లేకుండా జీవిస్తావు? నాన్న కూడా పోయాడాయె; ఏదో ఆయాచితంగా వచ్చిన యీ అవకాశాన్ని ఎందుకు వదులుకుంటావు? పోయి చదువుకో।" అన్నాడు హెడ్మాస్టరు. వెంకటేశ్వర్లుకి నవ్వొచ్చింది. తనకి లేని యీ అశాంతి యీ హెడ్మాస్టరుకి దేనికి? లోకంలో యిలాగే కొందరికి అనవసరంగా జాలి లభిస్తూవుంది. అయినా పోనీ, మించిపోయిందేముందిలే, పోయి చదువుకుందాం అనుకుని, చివరికి ఒప్పుకొని పట్నం చేరి కాలేజీలో ప్రవేశించాడు.

నాలుగేళ్లు కాలేజీలో చదివిన తర్వాత వెంకటేశ్వర్లు ఒక రకంగా మారాడు గాని, యింకో రకంగా కృతశిక్ష్యుడైనాడు. అప్పుడే సుందరితో పరిచయం కలిగింది. మొదటి ఎండాకాలం సెలవులకి స్వగ్రామం పోతూ సుందరిని అడిగాడు. ఆమె ఎక్కడికి వెళ్లుతుందని, "నేను ఎక్కడికి వెళతాను? పల్లెటూళ్ళంటే నాకు భయం గదా? అయినా వెళ్ళడానికి మాకు ఏదీ స్వగ్రామమయినా లేదు. సెంటు భూమిలేదు. గజం ఇల్లులేదు. అంచేత ఆ బాధ్యతలూ లేవు. హాయిగా పట్నంలోనే ఉంటాను" అంది. అప్పుడే యీ కొత్త రకం మనుషుల్ని వెంకటేశ్వర్లు గుర్తుపట్టాడు. తనకీ, సుందరికీ వ్యత్యాసం: సుందరికి అన్ని ఊళ్ళు ఒక్కటే. అన్నీ అన్నయ్యచేత ఉద్యోగం చేయించి, అన్నయ్యకి జీతం యిచ్చే ఊళ్లు. కొన్ని పెద్దవీ, కొన్ని మరీ పెద్దవీ. అంతే వాటిల్లో తేడా, తనకి అలా కాదు తన ఊరు ఒక్కటే తనది. తాతముత్తాతలంతా ఆగ్రామంలో, ఆయింట్లో పెరిగారు. ఆయింట్లోనే చనిపోయారు. ఆ ఇల్లు, ఇంటి చుట్టూరా ఉన్న మామిడితోట, యిరుగుపొరుగువాళ్లు, యిదంతా కలిపి ఒక సంపూర్ణమైన బొమ్మ. తమ కుటుంబం సుఖదుఃఖాలన్నీ ఆ ఇంట్లోనే గడిచాయి. ఆ మామిడి చెట్లు తమ ఆనందానికీ, విచారానికీ సాక్షులుగా ఉన్నాయి. అలాగే ఊర్లో ఉన్న

తక్కిన కుటుంబాలు, తన ఊర్లో తను ఒక నిండు మనిషి. ఫలానా వెంకటేశ్వర్లు ఫలానా వారబ్బాయి. వెంకటేశ్వర్లుకి జ్వరం వస్తే, ఊరంతా తెలుస్తుంది. ఊరంతా విచారిస్తారు. మహాపట్నంలో అలాకాదు. తనకి జ్వరంవస్తే ఓసారి డాక్టరుగారి వద్దకు వెళ్ళాడు, కన్సల్టేషను ఫీజు అయిదు రూపాయలన్నాడు డాక్టరు. ఈ డాక్టరు చాలా గొప్పవాడే కావచ్చు. ఘనమైన వైద్యుడే కావచ్చు, ఎంతో తెలిసినవాడు కావచ్చు. కాని డాక్టరు ఒక్కటి నేర్చుకోలేదు— మనిషి బాధను మనిషిగా పోల్చుకునే శక్తి, అది తన గ్రామంలోని సూరయ్యగారికే బాగా తెలుసు. సూరయ్యగారికి పెద్ద వైద్యం రాకపోవచ్చు. కాని మనిషి తన గ్రామంలో అంతా కలిసి ఒక స్వరూపం, బాధపడుతున్న వారికి సూరయ్య అభిమానంతో, తనవాడన్న బుద్ధితో వైద్యం చేస్తాడు. అంతా సూరయ్యకి సహాయం చేస్తారు— అతను బతకడానికి, తన ప్రజలకి డబ్బు అవసరం ఉంది. కాని అంతకంటే మనిషి అవసరాలకి ఎక్కువ గౌరవం ఉంది.

కాలేజీలో వెంకటేశ్వర్లుని చూస్తే, ఎందుకో సుందరికి అప్రయత్నంగా అభిమానం కలిగింది. తక్కిన వాళ్ళలో లేనిదేదో అతనిలో ఉంది. తక్కినవాళ్లు మాటాడితే మామూలుగానే ఉండేది. ఇతడు మాటాడితే సంపూర్ణమైన మనిషి మాటాడుతున్నట్లుండేది. సహజంగా, నిర్భయంగా ఉండేవాడు. తెచ్చిపెట్టుకున్న నాజూకులేమీ లేవు. అటువంటి అనాది మానవుణ్ణిచూసి సుందరి ఆశ్చర్యపడింది. సుందరిని చూసి, ఈమెలో ఇంకా మానవత్వం పూర్తిగా పోలేదని వెంకటేశ్వర్లు గ్రహించాడు. అంతకంటే అతన్ని ఎక్కువగా చలింపచేసింది సుందరి నిస్సహాయత. ఈ పిల్లకి ఎక్కడా చుట్టుకుందుకు నా అన్నచోటు లేదు. వేళ్లులేని క్రోటన్ మొక్క. ఆడది ఆవిధంగా అయిపోవడం అతనికి జాలివేసింది. ఈమెకి ఒక యిల్లూ, ఒక సంసారం, ప్రేమించేందుకు ఒక సంప్రదాయం— యిద్దామని అభిప్రాయపడ్డాడు. సుందరికూడా ఆవిధంగానే సరదా పడింది. అద్దెకొంపలు, కొనుక్కున్న పాలు,సంబంధం లేని యిరుగుపొరుగు వాళ్లు— వెంకటేశ్వర్లు చెప్పినాక అదంతా చప్పగా, కృత్రిమంగా కనబడింది. అందుకే వెంకటేశ్వర్లునే పెళ్ళి చేసుకొని అతడి గ్రామం వచ్చేసింది. మొట్టమొదట వాళ్ళ ఊరిలో అడుగు పెట్టగానే ప్రతిమనిషీకాక, ప్రతి చెట్టూ, ప్రతి పుట్టా, అతన్ని పలకరిస్తూంటే ఆమె ఎంతో సంబరపడింది. ఆ చిన్నయిల్లు, చుట్టూరా మామిడితోట. అత్తగారు, మరిది, పెరట్లో గేదెలు, మేకలు— తాను చిన్న రాజ్యానికి రాణి అని మురిసిపోయింది.

మొదటి రోజుల్లో రాత్రిళ్లు మామిడితోటలో మంచు తెరల్లో తిరుగుతూ వెంకటేశ్వర్లు అనేవాడు. మన భూములంత మంచివి కావు ఏమంత పండవు. మన మామిడితోట కూడా ఎందుకో కాపు మానేసింది. అయితేనేం? యివి మనవి. మన రక్తంలో రక్తం: వీటిని లాలించి, మచ్చిక చేసుకుని ఆదరించు" అనేవాడు. నిజమే అనుకుంది సుందరి. ఇవన్నీ మనవి. పాలేరు ఎండాకాలంలో మల్లెపువ్వులు తెచ్చి "దొరసానిగారూ, యివి తొలిమల్లెలు, మీకోసం తెచ్చాను" అనేవాడు. పట్నంలో జీవితమంతా అనామకంగా గడిపిన తనకి యిక్కడ ఒక మనిషిగా జరిగే పరిగణన చూస్తే ఆమెకి కొన్ని రాత్రిళ్లు ఆనందంతో నిద్రపట్టలేదు. పక్కనే అలిసి నిద్రపోయే వెంకటేశ్వర్లు వేపు కన్నీళ్ళతో, ప్రేమతో చూసేది.

క్రమంగా సుందరి కట్టుకున్న స్వప్నం చెదిరిపోవడం ప్రారంభించింది. భర్త ఎప్పుడూ ఏదో పనిమీద తోటలోనో, పొలాలమీదనో ఉండేవాడు. పాలేరువలె పనిచేసి, అలిసిపోయి యింటికొచ్చేవాడు. తనకా యింటి చాకిరీ మొదట్లో కొత్తగా, తమాషాగా వున్నా కొన్నాళ్ళకి విసుగ్గా, అందహీనంగా తోచింది. ఆ గేదె కింక అంత చాకరీ చేసేకంటే, హాయిగా పట్నంలో వలె, పాలు కొనుక్కోడం నయం అనిపించేది. క్రమంగా ఆమె రక్తం, పట్నవాసం అలవాట్లు ఆమెకి ఎదురు తిరిగి, యిక అక్కడ ఉండడం దుర్భరం అనుకుంది. ఒకనాడు రాత్రి భర్తతో అంది: "ఇంక యీ పల్లెటూరు జీవితం నేను గడపలేను" అని.

పల్లెటూరూ. పట్నవాసం అని ఏమిటి? ఎక్కడికి వెళ్ళినా మనం మనని మోసుకు వెళ్ళక తప్పదుగా? అసలు సమస్య అంతర్యంలోనిది. పల్లెటూరు ఏం చేసింది?" అన్నాడు భర్త.

మధ్యాహ్నం మామిడి తోటలో కూర్చుని, పట్నం గురించి కలలు కనేది_ అక్కడి నాగరికమైన జీవితం, పుస్తకాలు, సినిమాలు, రాజకీయాలు, మహాప్రపంచపు వడి, వేగమూ అంతా అక్కడే ఉంటే_ ఇక్కడ ఈ ప్రపంచం చివర, ఈ మన్యం మామిడి తోపులో, పిగిలి పిట్టల కూతలు వింటూ తను కాలం గడప వలసిందేనా?

నాలుగు నెలలనుండీ పోట్లాట ఎక్కువ చేసింది భర్తతో_ "ఇక్కడెవరున్నారు మనకి? మీ చెల్లెలికి పెళ్ళి చేసేసారాయె. అత్తగారు మనతోనే ఉండొచ్చు! ఎందుకీ దిక్కుమాలిన పల్లెటూళ్ళో! యీ పొలాలు పండవు. ఈ తోట పూచదు. ఈ గేదెలు పాలియ్యవు. దేనికిక్కడ మనం? హాయిగా పట్నం పోదాం రండి" అంది.

చివరికి భార్యాభర్తలు మాటలు మానేసే స్థితికి వచ్చారు. "నేను నిన్ను ప్రేమిస్తున్నాను సుందరీ! కాని, నేను ఒక్క గొడుగునో, చెంబునో అనుకోకు. ఎక్కడికి వెడితే అక్కడికి తీసుకు పోవడానికి. నేను యీ మట్టికి చెందినవాణ్ణి. పరమేష్ఠినుండి నా తరం దాకా, మావాళ్లు యీ గడ్డమీదనే పెరిగారు. నేనూ అంతే. నా తండ్రితాతలు రక్తం ఓడ్చి దున్నిన పొలాలు యివాళ పండలేదని అమ్మేయమంటావా? రేపు నీకు సంతానం కలుగబోదని నిన్ను వదిలేస్తానా?

అలాగే యిదీ అనుకో. నేను యివన్నీ వదులుకొని రావడం యుద్ధంలోంచి పారిపోయి రావడం వంటిది. నేను మూర్ఖుణ్ణనీ, పాతకాలం వాణ్ణనీ అనుకుంటావా? అయివుండొచ్చు. కానీ, మానవ జీవితంకూడా చాలా పాతది సుందరీ! సూర్యోదయాస్తమయాలు, జనన మరణాలు, రాగద్వేషాలు అన్నీ పాతవే" అనేవాడు.

చివరికి సుందరమ్మ నిశ్చయం చేసుకుంది. తాను చెప్పకుండా పట్నం వెళ్ళిపోవాలి. ఇక యీ పల్లెటూరులో బతకడం దుర్భరం. బతికి ఉండీ చచ్చినట్లు జమ అనుకుంది. ఆచలికాలం మధ్యాహ్నం మనస్సు విరక్తి చేసుకుని బయలుదేరింది. "బండీ పూయిస్తే ఎందుకంటాడు బండివాడు. ఈ పల్లెటూళ్ళో ఎవరికీ తెలియకుండా ఏ చిన్నపనీ చెయ్యలేం! ఎంత జైలు బ్రతుకు!" అనుకుంది. "రైల్వే స్టేషను ఊరికి ఏడు మైళ్లు దూరం ఉంది. ఫరవాలేదు, నడిచెయ్యగలను. భర్త పొలంనుండి యిల్లు చేరుకునే లోపుగా నేను నడిచి, రైల్వే స్టేషనుకువెళ్ళి రైలు ఎక్కెయ్యగలను" అలాగే బయలుదేరింది సుందరమ్మ. రెండేళ్ళ తర్వాత మళ్ళీ రైలు ఎక్కబోతున్నది. భర్త తనకంటె తన ఊరినే ఎక్కువ ప్రేమిస్తాడు. ప్రేమించనీ. తనని తనగా ప్రేమించేవాళ్లు ఎక్కడాలేరు.ఇక ఆ భాగ్యానికి మామూలు సుఖాలు, సరదాలు ఒదులుకోవడం దేనికి? అలా అలా ఆలోచిస్తూ, రాళ్ళగుట్టమీదా అలసట తీర్చుకుంటోంది సుందరమ్మ. చీకట్లు చిక్కబడు తున్నాయి.

* * *

సుందరమ్మ తెలివి వచ్చేసరికి పక్కన వెంకటేశ్వర్లు ఉన్నాడు. ధారాపాతంగా వాన పడుతోంది. ఉరుములు, మెరుపులు, హడిలిపోయి కెవ్వున కేక వేసింది. వెంకటేశ్వర్లు ఆమెను దగ్గరగా తీసుకొని "భయంలేదు సుందరీ! అన్నాడు: భర్త ఆ పరిస్థితిలో తనదగ్గిర ఉన్నందుకు సంతోషమూ, తాను దొరకి పోయానన్న భయం, బయట ప్రకృతి_ ఇవన్నీ ఆమెలో చిత్రమైన అనుభూతిని రేకెత్తించాయి. "భయంలేదు సుందరీ! పద. యీ కోటు కప్పుకో! ఇలా ఒంటరిగా వచ్చేశావేం!" అన్నాడు. సుందరి

మరీ భయపడింది. మళ్ళీ అన్నాడు భర్త. నేనూ ఆలోచించాను సుందరీ! నీకు సుఖంలేని యీవూరులో నిన్ను ఒంటరిగా ఉంచడం నాదే తప్పు. నీ సంతోషమే నా సంతోషం. పద! కొన్నాళ్ళపాటు పట్నం పోదాం!" అన్నాడు. వాన ధారాపాతంగా పడుతోంది. వాన! రెండేళ్ళ తర్వాత వాన! సుందరికి ఆక్షణంలో ఏదో ఆధ్యాత్మికమైన మార్పు కలిగింది. ఈ మారు భూమిలోవాన,భర్త. తన కోరిక, ఈ క్షణంలో అర్థం చేసుకొన్నాడు. ఆమె ఆలోచనలో ఏవో మెరుపులు మెరిశాయి. నిజం, ఎక్కడికెళ్ళినా మనని మనమే మోసుకెళ్ళడం. మనిషిని వలెనే భూమిని కూడా లాలించి ప్రేమించాలి. అంతేకాని. భయపడి పారిపోకూడదు. భూమిని విడిచి పారిపోయాం కనుకనే మనకిన్ని తిప్పలు! తన భర్త ఎంత గొప్పవాడు! అనుకుంది. తనని ఎంతగా ప్రేమిస్తున్నాడు అనుకుంది. తన స్థానం యిక్కడే. ఈ చిన్న సామ్రాజ్యానికి రాణి. అక్కడే ఉండి పోవడానికి నిశ్చయించుకుంది.

దూరాన, ఎవరో ఆ జడివానలో దీపాలు పట్టుకు వస్తున్నారు. "ఎవరు వాళ్ళు?" అంది సుందరి. "ఊరిలో వాళ్ళు, మనం యింటికి చేరకపోతే వెతకడానికి వస్తున్నారు!" అన్నాడు భర్త నీరసంగా. సుందరమ్మ అంది— "నన్ను మన్నించండి! మిమ్మల్నిగాని, యీ భూమిని అర్థం చేసుకోలేక పోయాను. మనం మన గడ్డ మీదే ఉందాం. ఇక్కడే మన జీవితం! నేనంతా గ్రహించాను. ఏమీ తెలియనిదాన్ని. మిమ్మల్నే నమ్ముకున్నదాన్ని, నన్ను మన్నించండి! యీ చిన్న తప్పుకి" అంది. వెంకటేశ్వర్లు అన్నాడు— "పోనీ, పట్నంలో కొన్ని నెలలు ఉండి వచ్చేద్దాం! నీ సరదా కూడా తీరుతుంది."

"వద్దు, వద్దు! మీ వారసుడు ఆ మురికి పట్నాల్లో జన్మించిడం నా కిష్టంలేదు" అంది సుందరమ్మ.

వెంకటేశ్వర్లు ఉలిక్కి పడ్డాడు! "నిజమే!" అన్నాడు.

"నిజమే అన్ని కోర్కెలూ ఫలిస్తున్నాయి. చూశారా! ఈ వాన చూడండి. మన పొలాలు కూడా ఫలిస్తాయి" అంది.

అంత చీకట్లోనూ వెంకటేశ్వర్లు కళ్ళు మెరిసి పోవడం ఆమె చూడగలిగింది. "సుందరీ! నీతో ఎక్కడికి రమ్మన్నా వస్తాను!" అన్నాడు.

"ఇంటికి పదండి, పోదాం, చూడండీ, కాస్త చేయూతనివ్వండి. ఒట్టిదాన్ని కూడా కాను" అంది.

"సుందరీ, నాన్నే బతికివుంటే నిన్ను చూసి ఎంత సంతోషించి ఉండేవాడో!" అన్నాడు.

"ఆయన యిప్పుడు మాత్రం—చూడడం లేదనా? ఏ కథా అంతం కాదు. కథలోంచి యింకో కథ జనిస్తుంది. అంతే" అంది సుందరమ్మ.

అంత వానలోనూ, వాళ్ళు జంటపావురాల్లా ఎగిరి ఇంటికొచ్చేశారు. ఆ రాత్రి మామిడి తోపుతో సుందరమ్మ కోర్కెలు తలుచుకుంటే, వెంకటేశ్వర్లు ప్రతిసారీ ఆనందంతో పులకరించేవాడు.

★